క్లుప్తంగా

యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



పెనమలూరు: యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు సంక్రమిస్తుందన్నారు. ఓటు నమోదు చేసుకోని వారు వెంటనే ఫారం 6 ద్వారా వివరాలు తెలిపి ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు చేసుకునే విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. 550 మంది బీటెక్ మొదటి ఏడాది విద్యార్థులు సదస్సుకు హాజరవ్వగా వీరిలో 185 మంది విద్యార్థులు ఓటు హక్కుకు దరఖాస్తు చేశారు. మిగితా విద్యార్థులు కూడా ఓటు హక్కు నమోదు చేసుకుంటామని తెలిపారు. డీటీ భవాని, ఆర్ఐలు భరద్వాజ్, రమేష్, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



నున్న(విజయవాడరూరల్): నున్న శివారు బోడపాడు గ్రామంలోని శ్రీభద్రాద్రి సీతారామ చంద్రస్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం శనివారం కనులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. అంతహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. 24 మంది పుణ్యదంపతులు కలాశాలను తీసుకురాగా స్వామి వారికి మహాసంప్రోక్షణ, కుంభాభిషేకం కార్యక్రమాన్ని వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకస్వాములు నిర్వహించారు. శ్రీభద్రాద్రి సీతారామ చంద్రస్వామి దేవస్థానం ప్రతిష్ఠించి పుష్కర కాలమైన సందర్భంగా మూడు రోజుల పాటు ఆగమోక్తముగా త్రయాహ్నిక దీక్షతో అష్టబంధన మహాసంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాలను నిర్వహించగా గ్రామస్తులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహాఅన్నసంతర్పణ కార్యక్రమంలో రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

10న కార్తిక వనసమారాధన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 10వ తేదీన కార్తిక వన సమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణపురంలోని శృంగేరి పాదుకా క్షేత్రంలోని తమ కార్యాలయంలోగానీ, 98481 48258 నంబర్‌లోగానీ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- ఈడుపుగల్లులో గడప గడపకు మన ప్రభుత్వం



ఈడుపుగల్లులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఈడుపుగల్లు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం చేపట్టారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రెయినేజీ సమస్యలను ప్రజలు వివరించారు. ఆయా సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో సమీక్షించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బ్రోచర్లను అందజేశారు.

సంక్షేమ పాలనకు మళ్లీ జగన్ రావాలి..

ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు దక్కాయన్నారు. ప్రతి గ్రామంలోనూ ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు అందించి, పక్కా ఇళ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. దేశం యావత్తూ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటుందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. అన్ని వర్గాలూ సంతోషంగా ఉండి చూసి తట్టుకోలేకపోతున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. సంక్షేమ పాలన కోసం మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఎంపీటీసీలు బూరగ బాలాజీ, షేక్ అమీనాబి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరి రాణి, నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, నకరికంటి శేఖర్, బిళ్లా వెంకటేశ్వరరావు, నాగదేశి రవి, నాగదేశి బాలకృష్ణ, షేక్ చిన్నా, వల్లపరపు నాగరాజు, జి.ఝాన్సీ, గుంటూరు రాజు, కొటేలు వెంకటేశ్వరరావు, ఎం.రాజశేఖర్‌రెడ్డి, దూరి గాంధీ, చెల్లి జోజీమేరీ, దూరి రాజు, చోరగుడి శ్రీకాంత్, కిరణ్, మాదు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ సర్వే పనుల ప్రారంభం



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

గన్నవరం: రూ.35 కోట్లతో నిర్మించనున్న గన్నవరం – పుట్టగుంట ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ నిమిత్తం సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఆర్అండ్‌బీ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సినిమా హాలు సెంటర్‌లోని నేషనల్ హైవే వద్ద జీరో పాయింట్ నుంచి సర్వే మొదలుపెట్టారు. తొలిరోజు ఆర్అండ్‌బీ ఏఈ శ్రీహరి పర్యవేక్షణలో ఎన్‌హెచ్ నుంచి వీఎస్ సెయింట్‌జాన్స్ హైస్కూల్ వరకు రహదారి స్థలం హద్దులను నిర్ధారించి మార్కింగ్ చేశారు. రహదారి విస్తరణ పనులు గన్నవరం నుంచి వయా ఉంగుటూరు మీదుగా పుట్టగుంట వరకు 20 కిలోమీటర్ల పొడవునా చేపట్టనున్నట్లు ఏఈ తెలిపారు. రెవెన్యూ శాఖ సహకారంతో త్వరితగతిన సర్వే పనులు పూర్తిచేసి మార్కింగ్ చేసిన వరకు రహదారిని విస్తరించనున్నట్లు చెప్పారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి విస్తరణ కోసం ఎమ్మెల్యే వంశీమోహన్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం పనులు చేపట్టింది. దీనిలో భాగంగా గన్నవరం నుంచి దావాజిగూడెం రామాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేయనున్నారు.

తెంపల్లిలో రహదారి నిర్మాణం

గన్నవరంరూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన రహదారుల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి బల్లిపర్రు రోడ్డు వరకు, అక్కడ నుంచి వీరపనేనిగూడెం వెళ్లే రోడ్డు వరకు నిర్మించిన డ్రెయిన్ల మధ్య గ్రావెల్‌తో పటిష్ఠంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు పై మురుగు నిలిచి అవస్థలు పడ్డారు. దీంతో స్పందించిన సర్పంచ్ కొలుసు శిరీష ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది.

కర్షక, కార్మిక పక్షపాతి సీఎం వైఎస్ జగన్



ఉయ్యూరులో ముఠా కార్మికుల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు పార్థసారథి, కైలే

ఉయ్యూరు: కార్మిక, కర్షక పక్షపాతి సీఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని పెద్ద ముఠా కార్మికుల నూతన కార్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం ముదునూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ధాన్యం లోడు లారీని పచ్చజెండా ఊపి మిల్లుకు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పార్థసారథి, అనిల్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల కష్టం తెలిసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి రైతులకు మద్దతు కల్పిస్తున్నామన్నారు. రైతులు ధాన్యం తోలిన వారం రోజుల్లోపే సొమ్ము ఖాతాలకు జమ అవుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, రాజులపాటి చిన్ని, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, సర్పంచ్ మొవ్వా వెంకట నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ గంజి స్వర్ణకుమారి, పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవి తదితరులు పాల్గొన్నారు.

బాలికల భవితకు బంగారు బాటలు వేయాలి



ఉంగుటూరు: బాలికల పట్ల వివక్ష చూపకుండా వారి భవితకు బంగారు బాటలు వేయాలని ఎంపీడీవో శేషగిరి రావు అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టిందంటే ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని సంబరపడతారు. అదే ఆడపిల్లకు బాల్య వయసులోనే వివాహం చేసి వారి భవితకు సంకెళ్లు వేస్తున్నారని చెప్పారు. ఆడ పిల్లలను, మగపిల్లలతో సమ భావంతో చూడాలని వివక్ష చూపకూడదని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల్య వివాహాలు కట్టడి చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి, సరైన వయసులోనే ఆడ పిల్లలకు వివాహం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివ రావు, సీసీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో రైతులకు మేలు



ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, అనిల్‌కుమార్

ఉయ్యూరు: వ్యవసాయ యాజమాన్య పద్ధతులతో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని బోళ్లపాడులో జిల్లాస్థాయి పొలంబడి క్షేత్ర దినోత్సవం శనివారం నిర్వహించారు. పార్థసారథి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తులు సాధించొచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ చర్యలు రైతులకు ఉపయుక్తంగా ఉంటున్నాయన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతూ పొలంబడి ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి మాట్లాడుతూ.. మేలైన యాజమాన్య పద్ధతులు అవలంభించటం ద్వారా ఎకరాకు రూ.4800 ఖర్చు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, డీడీ ఎస్.మనోహర్, ఏడీఏ సునీల్, ఉయ్యూరు చెరుకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి, జిల్లా వనరుల కేంద్రం డీడీ జ్యోతి రమణి, ఏవో పద్మజ, ఉయ్యూరు ఏవో నిస్సీ గ్రేస్, హరీష్‌కుమార్, లంక రవికుమార్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి



పెనమలూరు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. పోరంకిలో శనివారం గైడ్ సంస్థ కార్యాలయంలో ఏకం, ఎఫర్ట్, పీజీఎన్ఎఫ్ సంస్థల సహకారంతో హైజిన్ కిట్స్(పరిశుభ్రత కిట్స్) పంపిణీ చేసి ప్రసంగించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరు కావాలన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. స్థానిక మెడికల్ ఆఫీసర్లు మాధురి, సుస్మిత మాట్లాడుతూ విద్యార్థినులు రుతుపరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 30 మంది కిషోర బాలికలకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున విలువ చేసే సబ్బులు, టూత్ పేస్ట్‌లు, బ్రష్‌లు, శానిటరీ నాప్‌కిన్స్, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గైడ్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.రావు, మేనేజర్ సుజాత పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాలలో బ్లడ్ గ్రూపుల నిర్ధారణ పరీక్షలు

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌ను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. ఈ దిశగా విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు బ్లడ్ గ్రూపుల నిర్ధారణ క్యాంప్ ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ కమిటీని అభినందించారు. రెడ్‌క్రాస్ గన్నవరం శాఖ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం. విజయకుమార్, చైర్‌పర్సన్ చిన్నిమాధవి, వైస్ చైర్మన్ డాక్టర్ రాజకిషోర్, శ్రీమల్లికార్జున విద్యా సంస్థల చైర్మన్ ఎన్‌సీహెచ్ రాయుడు, డాక్టర్ వసంత, డాక్టర్ కృష్ణదీపిక పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకం



రామవరప్పాడు: రోగుల ఆరోగ్య భద్రత విషయంలో ఫార్మసిస్టులు కీలకపాత్ర వహించి వారు త్వరగా కోలుకునే విధంగా సహాయ పడుతున్నారని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ డెప్యూటీ సూపరింటెండెంట్ జె. నాగేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో శనివారం ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 62వ ఔషధ వారోత్సవాల ముగింపు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు, నిపుణులు రోగులకు ఔషధాలను ఇచ్చేటప్పుడు వాటిని ఎలా స్వీకరించాలో రోగులకు వివరించడం వల్ల దుష్ప్రభావాల నుంచి రక్షించబడతారన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ వారోత్సవాల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు ఫార్మా డీ విభాగపు అధ్యాపకులు పలు ఇంజినీరింగ్ కళాశాలలను సందర్శించి ఔషధ వినియోగంపై అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు పరిరక్షించుకోవాలి




పెనమలూరు: రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కులు పరిరక్షించుకోవాలని వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.దివాకర్‌బాబు అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం జాతీయ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దివాకర్‌బాబు మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రసాదించిన మౌలిక సూత్రాలు, మానవతా విలువలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. భారత రాజ్యాంగంలో 14, 15, 16, 17 అధికరణలు అంటరానితనం నిషేధించటం, వర్ణ వివక్షత లేకుండా చేయటం, అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమన్నారు. దేశంలో ప్రతి ఒక్కరి హక్కులు పరిరక్షించబడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులకు మాక్ పార్లమెంట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, అధ్యాపకుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన




పాతపాడు(విజయవాడరూరల్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత రైతుభరోసా కేంద్రం సిబ్బందేనని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు అన్నారు. పాతపాడు గ్రామ శివారు అప్పారావుపేట గ్రామంలో రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ.. గోనెసంచులు, తేమకొలిచే మీటరు, కంప్యూటర్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులే స్వయంగా గోనెసంచులు, ట్రాన్స్‌పోర్టు, కూలీలను ఏర్పాటు చేసుకున్నట్టయితే ఆ ఖర్చులు ప్రభుత్వమే చెల్లిస్తోందని చెప్పారు. రైతులు కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే సిబ్బంది అందుబాటులో ఉండి, ప్రతి ఒక్కటి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ ఏడాది వరిపంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఎకరాకు 38 నుంచి 42 బస్తాల దిగుబడులు వచ్చాయన్నారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు 9,985 ఎకరాల్లో ఎంటీయూ 1318, 1262, 1061 రకాల వరి పంట సాగు చేశారని చెప్పారు.

క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం



నున్న(విజయవాడరూరల్): క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహాలను కల్పించిందని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీటీవీ రమణ అన్నారు. స్థానిక కెనడీ హైస్కూల్ నందు శనివారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీటీవీ రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమేనని, క్రీడల్లో మంచి ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇస్తోందన్నారు. జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ స్కౌట్స్ గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కెనడీ హైస్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ సత్యరామకృష్ణ, డైరెక్టర్ సాయితేజ, ప్రిన్సిపాల్ రత్నకృష్ణ, పీఈటీ అప్పలరాజు పాల్గొన్నారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా క్రీడా ఉత్సవాలు



గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో శనివారం ఎన్టీటీఎఫ్ కళాశాల ఆధ్వర్యంలో క్రీడా ఉత్సవాలను నిర్వహించారు. తొలుత క్రీడా పోటీలను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మహీధర్ క్రీడా జ్యోతిని వెలిగించడంతో పాటు శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. తద్వారా ప్రతిభవంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, కళాశాల పరిపాలనాధికారి పద్మజా, నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు, పీడీ మీరాసాహెబ్ పాల్గొన్నారు.